భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి చట్టం

- రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



సదస్సులో మాట్లాడుతున్న రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

వలిగొండ, ఏప్రిల్ 22 : రైతుల భూ సమస్యల పరిష్కారం కోసమే రాష్ట్ర ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని వేంకటేశ్వర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్యక్షతన మంగళవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి పొంగులేటి మాట్లాడుతూ రాష్ట్రంలోని 4 జిల్లాల్లో, జిల్లాలోని ఒక మండలం, మండలంలోని ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసి భూ భారతి చట్టాన్ని అమలు చేస్తున్నామన్నారు. సాదా బైనామాలతో గతంలో భూములను కొనుగోలు చేసిన రైతులకు భూ భారతి చట్టం ద్వారా సమస్యలను పరిష్కరించబోతున్నామని చెప్పారు. ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై పోర్టల్ ద్వారా ఫిర్యాదులను స్వీకరించి భూమిని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం కలెక్టర్ హనుమంతరావు భూ భారతి చట్టంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అంతకుముందు రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్, సోమవారం మృతిచెందిన క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటాలకు నివాళి అర్పించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓలు కృష్ణారెడ్డి, శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి, వలిగొండ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమానాయక్, మత్స్యాద్రి దేవస్థానం చైర్మన్ కొమ్మారెడ్డి నరేశ్‌రెడ్డి పాల్గొన్నారు.

హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

మోత్కూరు, ఏప్రిల్ 22 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఎన్నికల హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని కేఆర్ భవనంలో మంగళవారం జరిగిన సీపీఐ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం నిరుద్యోగులు, రైతులు, కార్మికుల సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో తమకు స్నేహపూర్వక అవగాహన ఉన్నప్పటికీ ప్రజల సమస్యలను విస్మరిస్తే సహించేది లేదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం కగార్ ఆపరేషన్ పేరుతో మావోయిస్టులను హతమార్చడం హేయమైన చర్య అన్నారు. కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మావోయిస్టులతో చర్చలు జరుపాలని సూచించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, కౌన్సిల్ సభ్యులు చంద్రయ్య, సత్యనారాయణ, లక్ష్మీనర్సయ్య, ముత్యాలు, హరిచంద్ర, ఇమ్రాన్, రాజయ్య, సుదర్శన్, వెంకట్ పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తాం

- ఎంపీ చామల, ఎమ్మెల్యే వీరేశం

బుచ్చమ్మ గుడిసెలో భోజనం చేస్తున్న ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, కలెక్టర్ హనుమంతరావు

రామన్నపేట, ఏప్రిల్ 22 : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తామని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. మండల కేంద్రంలోని దళిత వాడలో బుచ్చమ్మ గుడిసెలో కలెక్టర్ హనుమంతరావుతో కలిసి మంగళవారం వారు రేషన్‌పై ఇచ్చిన సన్నబియ్యంతో వండిన భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బుచ్చమ్మకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంటి నిర్మాణానికి ఎంపీ, ఎమ్మెల్యే రూ.20వేల చొప్పున, కలెక్టర్ పది వేల రూపాయల ఆర్థిక సాయం అందిస్తామని తెలిపారు. సంక్షేమ పథకాలు అందించి పేద కుటుంబాన్ని ఆదుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్ నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మెన్ సిరిగిరెడ్డి మల్లారెడ్డి, మాజీ సర్పంచ్ గోదాసు శిరీష, జింకల ప్రభాకర్ పాల్గొన్నారు.

భూ భారతితో భూ సమస్యలకు పరిష్కారం : కలెక్టర్

చౌటుప్పల్, ఏప్రిల్ 22 : భూ భారతి చట్టంతో ఏండ్ల తరబడి ఉన్న భూ సమస్యలకు పరిష్కారం లభించనున్నదని కలెక్టర్ వి.హనుమంతరావు అన్నారు. పట్టణంలో మంగళవారం భూ భారతి చట్టంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 23 సెక్షన్లు, 19 రూల్స్‌తో అతి చిన్న చట్టంగా భూ భారతి రూపొందించబడిందన్నారు. ఈ చట్టంపై మండలాల వారీగా రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేసి పైసా ఖర్చు లేకుండా భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. వచ్చే నెల 1నుంచి నియోజవర్గానికి ఒక మండలాన్ని ఎంపిక చేసి రెవెన్యూ సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ, సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య, ఏఓ ముత్యాల నాగరాజు, మున్సిపల్ మాజీ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి : కలెక్టర్

ధాన్యం కొనుగోలు కేంద్రంలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

వలిగొండ, ఏప్రిల్ 22 : ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ హనుమంతరావు కొనుగోలు కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. మండల కేంద్రంలోని కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రైతులతో మాట్లాడారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని, కొనుగోలు చేసి ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని హెచ్చరించారు. అకాల వర్షాలు పడుతున్నందున సెంటర్ నిర్వాహకులు టార్పాలిన్లు అందుబాటులో ఉంచుకొని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎంపీడీఓ

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22 : సంక్షేమ పథకాలను అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని బాలంపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్‌తో కలిసి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు.

ఇందిరమ్మ ఇంటి మోడల్ నిర్మాణ పనులు పరిశీలన

ఆత్మకూరు(ఎం) : తాసీల్దార్ కార్యాలయం ఆవరణలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇంటి మోడల్ నిర్మాణ పనులను తాసీల్దార్ లావణ్య మంగళవారం పరిశీలించారు. ఆమె వెంట డిప్యూటీ తాసీల్దార్ సఫియొద్దీన్, ఆర్ఐ మల్లికార్జున్‌రావు, ఎంఆర్ఐ వెంకటేశం ఉన్నారు.

తెలంగాణ ప్రభుత్వము
సాంకేతిక విద్యాశాఖ
గవర్నమెంట్ పాలిటెక్నిక్ హాస్టల్, యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లా - 508115

నెం.జిపిటి-వైజిటి/హాస్టల్/2025 టెండర్ ప్రకటన తేది:22-04-2025

గవర్నమెంట్ పాలిటెక్నిక్ హాస్టల్, యాదగిరిగుట్ట, యాదాద్రి భువనగిరి జిల్లా-508115, 2025 విద్యా సంవత్సరమునకు హాస్టల్ నందు "మెస్ మరియు మెయింటెనన్స్" చేయుటకు యాదాద్రి భువనగిరి జిల్లా వాస్తవ్యులు మాత్రమే అయివుండి, అర్హత/ఆసక్తి మరియు అనుభవం కలిగిన వారి నుండి సీల్డు టెండర్లు కోరబడుచున్నవి. టెండరు ఫాం మరియు ఇతర వివరముల కొరకు, ప్రిన్సిపాల్ గవర్నమెంట్ పాలిటెక్నిక్, యాదగిరిగుట్ట, ఆఫీసునందు తేది:28-04-2025 10.00గంటల నుండి 500/- రూపాయలు చెల్లించి పొందగలరు. టెండర్ ఫాం సమర్పించుటకు చివరి తేది:07-05-2025 మధ్యాహ్నం 2.00 గంటల వరకు ఇతర వివరములకు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు. 9010222182, 9912344439, 9505042359.

సం/- ప్రిన్సిపాల్

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు భారీగా తరలి రావాలి

- మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి

తుర్కపల్లి, ఏప్రిల్ 22 : వరంగల్ జిల్లా ఎల్వుతుర్తిలో ఈ నెల 27న నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు స్వచ్ఛందంగా తరలి వచ్చేందుకు ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారని, వారిని తరలించే బాధ్యత గ్రామాల్లో నాయకులు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. తెలంగాణ విముక్తి కోసం కేసీఆర్ అలుపెరుగని పోరాటం చేసి రాష్ట్రాన్ని సాధించారన్నారు. స్వరాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ప్రథమ స్థానంలో నిలిపేందుకు ముఖ్యమంత్రిగా కృషి చేశారని తెలిపారు. కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. బీఆర్ఎస్‌కు ప్రజలే వారసులని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కేసీఆర్ నిర్వహించనున్న మరో ఉద్యమానికి పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పిన్నపురెడ్డి నరేందర్‌రెడ్డి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బీకూనాయక్, మాజీ ఎంపీపీలు సుశీలారవీందర్, ఉప్పలయ్య, నాయకులు నవీన్ కుమార్, వెంకట్‌రెడ్డి, మల్లప్ప, బిచ్చునాయక్, శ్రీశైలం, హరినాయక్, రాంజీ, బాలకృష్ణ, శ్రీకాంత్, యాకూబ్, భాస్కర్‌నాయక్, బద్దునాయక్, ఓంకార్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

బొమ్మలరామారం : మునీరాబాద్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు తొంట సత్యనారాయణకు ట్రాక్టర్ తగలడంతో తీవ్ర గాయాలయ్యాయి. ఉప్పలబాబు తల్లి ఇటీవల మరణించింది. వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే సునీతామహేందర్‌రెడ్డి పరామర్శించి సానుభూతి తెలిపారు.

ఇంటర్ ఫలితాల్లో సర్వేల్ గురుకుల విద్యార్థుల ప్రతిభ

తేజాచారి (989)

అసద్ (447)

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 22 : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో సర్వేల్ గురుకుల కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. ఫస్టియర్‌లో 162 మంది విద్యార్థులకు 150 మంది ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్‌లో 148 మందికి అందరూ పాసయ్యారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో తేజాచారి 989 మార్కులు, బైపీసీలో విక్రం 984, ఎంఈసీలో సూర్యకష్ణ 965 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు. ఫస్టియర్ ఎంపీసీలో ఆశోక్ 468, బైపీసీలో శివప్రసాద్, జగదీశ్ 435, ఎంఈసీలో శరణ్ 495 మార్కులు సాధించారు. రాష్ట్ర స్థాయిలో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ సతీశ్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. సెకండియర్ ఎంపీసీలో మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సంగిశెట్టి సాయికుమార్ 975, ఫస్టియర్ బైపీసీలో దీక్షిత 421, ఎంపీసీలో మహమ్మద్ అసద్ 447 మార్కులు సాధించారు. మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాల విద్యార్థులు ప్రథమ సంవత్సరంలో 102 మందికి 32 మంది మాత్రమే పాసయ్యారు. సెకండియర్‌లో 93 మందికి 59మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ

రామన్నపేట : రామన్నపేట జనంపల్లి గురుకుల పాఠశాల విద్యార్థినులు సెకండియర్‌లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 98.5శాతం మంది పాసయ్యారు. సీనియర్ ఇంటర్‌లో ఎంపీసీలో రాసన్య 991 సాధించి టాపర్‌గా నిలిచింది. బైపీసీలో ఎం.నందిని, శ్రీబిందు 989 మార్కులతో మొదటి స్థానంలో నిలిచారు.

యాదగిరిగుట్ట ప్రభుత్వ జూనియర్ కళాశాల సెకండియర్ విద్యార్థులు 72 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. 99 మందికి గానూ 71 మంది విద్యార్థులు పాసయ్యారు. ఫస్టియర్లో 77మందికి 20 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. సెకండియర్ బైపీసీలో నమిలే శృతి 904 మార్కులు, ఎంపీసీలో జి.వంవీ 840 మార్కులు సాధించారు.

గుండాల : ఇంటర్ ఫలితాల్లో మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. సెకండియర్ బైపీసీలో నీరటి బ్యూల 959 మార్కులు, పురుగుల అక్షయ 930, ఎంపీసీలో శివరాత్రి పూజ 954, అవిశెట్టి నందిని 930, సీఈసీలో కల్వల వైష్ణవి 934 మార్కులు సాధించారు. ఫస్టియర్‌లో ఎంపీసీలో జినుకల అక్షయ 439, బైపీసీలో అన్నెపర్తి శ్రీజ 409, సీఈసీలో తొగరు మహేశ్ 404 మార్కులు సాధించారు.

అడ్డగూడూరు : మండలంలోని సాంఘిక సంక్షేమ కళాశాల విద్యార్థులు ఎంపీసీ మొదటి సంవత్సరంలో 81.5 శాతం, బైపీసీలో 100 శాతం, సెకండియర్ ఎంపీసీలో 100, బైపీసీలో 95శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ విజినా తెలిపారు. ఫస్టియర్ ఎంపీసీలో దాసరి కోమల 454 మార్కులతో మండల ప్రథమ ర్యాంకు, దయ్యాల మానస 453 మార్కులతో ద్వితీయ ర్యాంకు సాధించారు.

భూదాన్ పోచంపల్లి : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన వై.భావన 982 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. కె.పూజిత (బైపీసీ) 904 మార్కులు సాధించింది. మోడల్ స్కూల్‌కు చెందిన ఎం.దీపిక (ఎంపీసీ) 933, పి.శృతి (బైపీసీ) 907 మార్కులు సాధించారు. దేశ్‌ముఖిలోని గురుకుల పాఠశాలలో బి.గణేశ్‌కుమార్ (ఎంపీసీ) 962, డి.శివకేశవ (బైపీసీ) 944 మార్కులు సాధించారు.

మోటకొండూరు : మండల కేంద్రంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు ఫస్టియర్‌లో 83 శాతం, ద్వితీయ సంవత్సరంలో 92 శాతం ఉత్తీర్ణత సాధించారు. మొదటి సంవత్సరంలో ఎంపీసీలో బి.శ్రావణి 464, పి.వర్షిత 459, బైపీసీలో వైశాలి 426, లావణ్య 412, సీఈసీలో పి.మానస 473, భానుమతి 473, సెకండియర్ ఎంపీసీలో హరిణి 990, కావ్య 988, బైపీసీలో మానస 962, హిందు 952, సీఈసీలో అఖిల 972, సృజన 928 మార్కులు సాధించారు.

పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22 : మండలంలోని బస్వాపురం గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ విద్యార్థి పరీక్షల్లో ఫెయిల్ అయ్యానని మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రాసాల మల్లేశ్ కుమారుడు అరవింద్ (17) భువనగిరి పట్టణంలోని శ్రీవైష్ణవి జూనియర్ కళాశాలలో ఎంపీసీ ఫస్టియర్ చదువుతున్నాడు. మంగళవారం విడుదలైన ఫలితాల్లో రెండు సబ్జెక్టుల్లో ఫెయిల్ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురయ్యాడు. దీంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. వచ్చిచూసేసరికి అప్పటికే మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు వచ్చి మృతదేహాన్ని భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అరుణ్‌కుమార్ కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ ఎన్.చంద్రబాబునాయుడు తెలిపారు.

సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్ పోచంపల్లి, ఏప్రిల్ 22 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానందతీర్థ గ్రామీణ సంస్థలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్ యోజన ద్వారా నిర్వహించే సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ చైర్మన్ ఎన్.కిశోర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడున్నర నెలల కాలపరిమితితో కూడిన అకౌంట్ అసిస్టెంట్ ట్యాలీ (బీకాం పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (ఇంటర్మీడియట్ పాస్), ఆటోమొబైల్ టు వీలర్ సర్వీసింగ్ (పదో తరగతి పాస్) కోర్సులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. మే 5న ఉదయం 10 గంటలకు రామానందతీర్థ సంస్థలో సర్టిఫికెట్లతో హాజరు కావాలని సూచించారు. గ్రామీణ నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత శిక్షణ, హాస్టల్‌లో భోజన వసతితోపాటు ఉద్యోగం కల్పించబడునని తెలిపారు. వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 9948466111 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

చౌటుప్పల్ రూరల్, ఏప్రిల్ 22 : మండలంలోని డి.నాగారం గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పీఏసీఎస్ చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఉబ్బు వెంకటయ్య మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ ఇప్పటికీ ఆరు కొనుగోలు కేంద్రాల ద్వారా 5,920 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు.

రైతులకు ఇబ్బందులు రానీయొద్దు : ఏడీఏ

గుండాల, ఏప్రిల్ 22 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఏడీఏ డి.పద్మావతి అన్నారు. మండల కేంద్రంతోపాటు వెల్మజాల గ్రామంలో పీఏసీఎస్, ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం శుద్ధి చేసే యంత్రాలు అందుబాటులో ఉంచాలన్నారు. ఆమె వెంట ఏఈఓ క్రాంతికుమార్, పీఏసీఎస్ నిర్వాహకులు మంగ ఉన్నారు.

బైరెడ్డి ధనుశ్‌రెడ్డికి సన్మానం

అడ్డగూడూరు : హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఇటీవల రామానుజన్ ఫౌండేషన్ నిర్వహించిన ఫిజిక్స్ ఒలింపియాడ్‌లో ప్రథమ బహుమతి గెలుచుకున్న మండల కేంద్రానికి చెందిన బైరెడ్డి ధనుశ్‌రెడ్డిని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు కొమ్మిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. మాజీ ఎంపీపీ దర్శనాల అంజయ్య, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్వర్లు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మహేంద్రనాథ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి సత్యంగౌడ్, మాజీ ఎంపీటీసీ జనార్దన్‌రెడ్డి పాల్గొన్నారు.

28న మహాధర్నాను జయప్రదం చేయాలి : సీపీఎం

సమావేశంలో మాటట్లాడుతున్న జహంగీర్

రామన్నపేట, ఏప్రిల్ 22 : ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 28న కలెక్టరేట్ వద్ద నిర్వహించే మహాధర్నాను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ కోరారు. మండల కేంద్రంలో మంగళవారం జరిగిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రామన్నపేటలో ఏర్పాటు చేయతలపెట్టిన అంబుజా సిమెంట్‌పై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బునాదిగాని కాల్వ, ధర్మారెడ్డిపల్లి, పిల్లాయిపల్లి కాల్వల పనులతోపాటు బస్వాపురం రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నారు.

సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జెల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం, నాయకులు అంజయ్య, ఆనంద్, హన్మంతు, నగేశ్, విజయ్‌భాస్కర్, బాలరాజు, ఉపేందర్, రషీద్ పాల్గొన్నారు.

మదర్ డెయిరీని ఆదుకోవాలి : రైతు సంఘం

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22 : రాష్ట్ర ప్రభుత్వం రూ.50కోట్లు గ్రాంట్ల రూపంలో ఇచ్చి మదర్ డెయిరీని ఆదుకోవాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాటూరి బాలరాజుగౌడ్, జిల్లా సహాయ కార్యదర్శి కోమటిరెడ్డి చంద్రారెడ్డి డిమాండ్ చేశారు. పాల రైతులకు పెండింగ్ బిల్లులను చెల్లించి, ప్రభుత్వం ప్రకటించిన ఐదు రూపాయల ప్రోత్సాహకాన్ని రైతుల ఖాతాల్లో జమ చేయాలని కోరారు. మండలంలోని హన్మాపురం, వడపర్తి గ్రామాల్లోని మదర్, విజయ డెయిరీల పాల కేంద్రాల వద్ద మంగళవారం రైతులతో కలిసి ఈ నెల 24న ఆలేరులో నిర్వహించే రాష్ట్ర సదస్సు కరపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. పీఏసీఎస్ డైరెక్టర్ నరసింహ, రైతు సంఘం నాయకులు మహేశ్, కొమురయ్య, బాలకృష్ణ, వెంకటేశ్, మల్లేశం, నర్సిరెడ్డి, జంగయ్య పాల్గొన్నారు.

భువనగిరి మండలంలో ఈదురుగాలులతో వర్షం

వడపర్తిలో లేచిపడిన ఇంటి పైకప్పు రేకులు

భువనగిరి కలెక్టరేట్, ఏప్రిల్ 22 : మండలంలోని వడపర్తి, హన్మాపురం, బీఎన్ తిమ్మాపురం తదితర గ్రామాల్లో మంగళవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. దాంతో పలు గ్రామాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. ఈదురుగాలులకు వడపర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని భారీ రావి చెట్టు కూకటి వేళ్లతో నేలకొరిగింది. గ్రామానికి చెందిన నవనీత ఇంటి పైకప్పు పూర్తిగా ధ్వంసమై కిందపడింది.

మే 20న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి : మల్లేశం

బీబీనగర్, ఏప్రిల్ 22 : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరిగే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కల్లూరి మల్లేశం కార్మికులకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందని విమర్శించారు. మోదీ విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా జరిగే సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సీఐటీయూ మండల కన్వీనర్‌గా కందాడి దేవేందర్‌రెడ్డి, 11 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. సమావేశంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు గాడి శ్రీనివాస్, పొట్ట యాదమ్మ, మిషన్ భగీరథ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ శ్రీను, ట్రాన్స్‌పోర్ట్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉమర్, నాయకులు బాలయ్య, సురేశ్, చంద్రయ్య, లింగస్వామి పాల్గొన్నారు.

న్యాయం చేయాలని భార్యాభర్తల ఆందోళన

- వారం రోజులుగా వ్యవసాయ భూమి వద్దే ఉంటూ నిరసన

చేను వద్ద ఉంటూ ఆందోళన చేస్తున్న భాస్కర్‌రెడ్డి, ఉమ దంపతులు

మోటకొండూర్, ఏప్రిల్ 22 : తమకు న్యాయం చేయాలని కోరుతూ మండలంలోని ఇక్కుర్తి గ్రామానికి చెందిన చామకూర భాస్కర్ రెడ్డి, తన భార్య ఉమతో కలిసి వారి వ్యవసాయ భూమి వద్ద ఆందోళన చేపట్టారు. వారం రోజుల నుంచి వార